# సర్వశక్తి సంకేతం ఈ వ్రతం



ఉపాస్యదేవతలను మొదలుకొని కులదేవతల వరకు గొప్ప దేవతా వ్యవస్థ మన సంస్కృతిలో భాగం. ఎవరి ఆచార సంప్రదాయాల కనుగుణంగా వారు తమ పరంపరాగత కులదేవతలను విధ్యుక్త నియమాలతో ఆరాధించాలి. కులదేవతల అనుగ్రహం చేత అభీష్టైశ్వర్యాలు లభించడమే కాక, అరిష్టాలు తొలుగుతాయి. కులదేవతల్ని నిర్లక్ష్యపరిస్తే ఆ దోషం చేత వేదనలు కలుగుతాయి.

అఖిండాలేశ్వరి పరాశక్తి దుర్గాది మహాదేవీ రూపాలలోనే కాక, ఇంకా అనేకానేక అంశ, కళ, కళాంశాంశ రూపాలతో ఆరాధితురాలు. అలాగే కులదేవతలుగా ఆరాధింపబడేవి కూడా ఆ దేవియొక్క అంశ శక్తులే. ఈ విషయం దేవీ భాగవతం చెబుతోంది.

అనేక విప్ర కుటుంబాలలో బహువిధ రూపాలుగా కామేశ్వరీ కులదేవతారాధన ప్రసిద్ధి. భక్తుల అభీష్ట కామనలను నెరవేర్చే ఈ తల్లి వ్రతకల్పాన్ని ఇంతటి శ్రద్ధాశక్తులతో, భక్తి ప్రపత్తులతో శ్రీ ఆకుండివారు వెలువరించడం ఆనందదాయకం.

పరాశక్తి తత్త్వంపై అవగాహన కలిగిన శ్రీ నారాయణమూర్తి దంపతులు ఎంతో శ్రమకోర్చి ఈ గ్రంథాన్ని రూపొందించారు.

ఈ రూపకల్పనయే ఒక గొప్ప వ్రతపాలన. శ్రీకామేశ్వరీ దేవత సంపూర్ణ అనుగ్రహమే వీరికి లభించే సత్ఫలం.

వ్రతకథలు, నోముల కథలు, మనకు అసంఖ్యాకంగా ఉన్నాయి. ప్రధానమైన కల్పంలో ఈ కథల్ని సమకూర్చడం సంప్రదాయం. ఈ కథలు జరిగాయా లేవా అన్న తర్క మీమాంసలు అనవసరం. ఈ కథలలో మనకు తెలియని యజ్ఞసంకేతాలు, మంత్ర యంత్ర సంకేతాలు, యోగశాస్త్ర ప్రతీకలు ఉంటాయి. వీటి పఠన శ్రవణాదుల వలన ఆ యజ్ఞఫలాలను అతి సామాన్యులకు సైతం అందజేయాలని ఆ కల్పకర్తలైన ఋషుల సంకల్పం.

ప్రస్తుత కామేశ్వరీ వ్రత కథ కూడా అటువంటి సంకేతాలతో, ప్రతీకలతో కూడినదే. బహుయజ్ఞ విశేషాలతో దీనిని అన్వయించడం కష్ట సాధ్యమే. అయినా కొంతమేరకు సంప్రదాయ భావనా పరిజ్ఞానంతో పరిశీలిస్తే కొంత అవగాహన కలగవచ్చు.

బ్రహ్మాండ పురాణంలోని లలితా కామేశ్వరీ భావనలోని కొన్ని ఛాయలు ఈ కథలో కనిపిస్తాయి.

శివుడు శూలంతో బావిని తవ్వడం, దాహంతో నున్న పార్వతి పది దోసిళ్ళు త్రాగడం, పదిగర్భాలు కలగడం, ఆ తల్లి అవయవాల నుండి బహుమూర్తులు ఆవిర్భవించడం, అందులో ఇద్దరు పురుష మూర్తులు కావడం- కథలోని ప్రధానాంశాలు.

జ్ఞానస్వరూపుడైన శివుడు తన గురుశక్తితో ఆవిష్కరించిన జ్ఞానానంద చిచ్ఛక్తియే లోతైన కొలను. అదే పాలకొలను. ఆ స్వామి శక్తికే అది అర్పితం. అలా శివశక్త్యర్పితమైన జ్ఞానం వలన సంతసించిన ఆ తల్లి (*బిందు తర్పణ సంతుష్టా...*) మనలను అనుగ్రహించడానికై తన విభూతులను వివిధ దేవతాకృతులుగా వెలువరించడమే కాక, అవన్నీ తన స్వరూపాలేననే ఏకజ్ఞానాన్ని కలిగించింది. స్త్రీ శక్తులు ఏడుగురు - సోదరులు (పురుష శక్తులు) ఇద్దరు. వీటిని యోగపరంగా భావిస్తే - సుషుమ్నలోని మూలాధారాది సహస్రారాంతం సప్త చక్రాలు, ఇడా పింగళ నాడీ స్వరూపాలు స్పష్టమౌతాయి. సహస్రారాంతరమున అమృతరసప్రవాహమే పాలకొలను. ఇది యోగసంకేతమైతే - సోమరస పానము, సప్తార్చి (అగ్నిజ్వాలలు ఏడు)జ్ఞానము, సూర్యాగ్నుల తత్త్వము యజ్ఞపరంగా సంకేతాలు. పది శృంగారరంగాలు యంత్రంలోని ఆవరణ చక్రాలు. సప్తధాతువులకీ, ప్రాణశక్తులకీ కూడా ఇవి సంకేతాలు.

ఉపాస్యదేవత అన్ని క్షేత్రాల దేవతలనీ రప్పించి క్రీడించడమే కాక, త్రిశక్తులను సాధించినట్లుగా ఉన్న కథాభాగాన్ని పరిశీలిస్తే - ఆరాధ్యయైన కామేశ్వరీ దేవతను సామాన్యగా తలచరాదనీ, ఆ తల్లి సర్వదేవతాత్మిక, సర్వశక్తిమయి అనే సత్యాన్ని భావించి ఆరాధించాలనే ఉపదేశం స్పష్టమౌతుంది.

యజ్ఞాలలో దేవతా ప్రీతికి సామగానాన్ని చేసినట్లుగానే, నోము

లలో, వ్రతాలలో పాటలు ప్రధానం. ఆ పాటరూపంలో 'సామగాన ప్రియ'కు కొలనుపాట రచింపబడింది.

'కులేశ్వరి', 'కులయోగిని', 'కులాంతస్థా'- అయిన తల్లిని 'శ్రియం వాసయ మేకులే....' అని ప్రార్థించే వైదిక విజ్ఞానమే ఈ కులదేవతారాధనలో గోచరిస్తోంది.

ఎవరి కులదేవతను వారు శ్రద్ధా భక్తులతో ఆరాధించుకొనే సంప్రదాయాన్ని మరింత పదిల పరచవలసిన బాధ్యతను నిర్వహించిన ఈ దంపతులకు అభినందన పూర్వక నమశ్శతాలు. ఈ దివ్య గ్రంథంలో నాకు ఈ విధంగా చోటు కల్పించినందుకు ధన్యవాదాలు.

హైదరాబాద్
10-04-2006

బుధజన విధేయుడు
సామవేదం షణ్ముఖశర్మ